

ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 139 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-

బుధవారం 25 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888


Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## వాజ్ పేయీకి నివాళులర్పించిన
## రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖులు

మాజీ ప్రధాని వాజ్ పేయీ శతజయంతి సందర్భంగా ఢిల్లీలోని 'సదైవ్ అటల్' వద్ద ప్రముఖులు నివాళులర్పించారు.

**ఢిల్లీ, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** మాజీ ప్రధాని వాజ్ పేయీ శతజయంతి సందర్భంగా ఢిల్లీలోని 'సదైవ్ అటల్ వద్ద ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధనఖడ్, ప్రధాని నరేంద్రమోదీ, మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు అమి జేపీ నడ్డా, ఏపీ సీఎం చంద్రబాబు పలువురు ఎంపీలు వాజ్పేయికి అంజలి ఘటించారు.





### భారత జాతి గర్వించదగిన నేత వాజ్పేయి: చంద్రబాబు

వాజ్ పేయి దూరదృష్టి వల్లే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వాజ్పేయి జయంతి సందర్భంగా 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "భారతజాతి గర్వించదగిన నేత వాజ్పేయి. ఆయన దూరదృష్టి వల్లే నేడు మన దేశం ప్రపంచదేశాలతో పోటీ పడుతోంది. దేశం గురించి ఆలోచించే తీరు విలక్షణమైనది. సంస్కరణల ప్రతిపాదనలపై వాజ్పేయి స్పందించిన తీరు ఎన్నటికీ మరచిపోలేను. ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## శాంతాక్లాజ్ వేషధారణలో కేజ్రీవాల్
## .. వీడియో పోస్టు చేసిన ఆప్

ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజీవాల్ శాంతాక్లాజ్ గెటప్ లో ఉన్న వీడియోను ఆ పార్టీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.




**ఢిల్లీ, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** క్రిస్మస్ సందర్భంగా ఆన్ఆద్మీ పార్టీ ఢిల్లీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసింది. ఈమేరకు ఓ వినూత్న వీడియోను షేర్ చేసింది. శాంతాక్లాజ్ దుస్తుల్లో ఉన్న ఆప్ అధినేత అరవింద్ కేజీవాల్ ప్రజలకు బహుమతుల రూపంలో పలు ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లుగా ఆ వీడియోను రూపొందించారు. ఢిల్లీ ప్రజలకు వారి సొంత శాంతా ఏడాది పొడవునా బహుమతులు ఇస్తూనే ఉన్నారని ఆప్ ఈ వీడియోకు వ్యాఖ్యను జత చేసింది. ఇది ఏఐ వీడియోనా? లేక కేజీవాల్ స్వయంగా శాంతాక్లాజ్ గెటప్ వేసుకున్నారా? అనే విషయాన్ని వెల్లడించలేదు.ఢిల్లీ ప్రభుత్వం అక్కడి ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను రూపొందించింది. ప్రస్తుతం ఉచిత కరెంటు, విద్య, వైద్యం సహా ఇతర పథకాలను లబ్ధిదారులు పొందుతున్నారు. తాము మరోసారి అధికారంలోకి వచ్చాక మరిన్ని పథకాలు ప్రవేశపెట్టనున్నట్లు ఆప్ అధినేత అరవింద్ కేజ్రివాల్ ఇటీవల పేర్కొన్నారు. 'మహిళా సమ్మాన్ యోజన' కింద మహిళలకు ప్రతినెలా రూ.2,100 ఆర్థికసాయం, సీనియర్ సిటిజన్లకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించారు.ఢిల్లీలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆప్ ఎన్నికల ప్రచారాలను ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆ పార్టీ తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. దీని ప్రకారం.. ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజీవాల్ న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనుండగా.. సీఎం ఆతిశీ మరోసారి కాల్కాజీ సీటు నుంచి బరిలో నిలుస్తున్నారు. అలాగే, గ్రేటర్ కైలాశ్ సీటు నుంచి సౌరభ్ భరద్వాజ్, బాబరుర్ నుంచి గోపాల్రాయ్, ఓఖ్లా నుంచి అమానతుల్లా ఖాన్, షాకుర్బస్తీ నుంచి సత్యేందర్కుమార్ జైన్ ను బరిలో దించింది.

## ఏడుపాయల వనదుర్గామాతను
## దర్శించుకున్న సీఎం రేవంత్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మెదక్ జిల్లా ఏడుపాయలలో వనదుర్గామాతను దర్శించుకున్నారు.



**ఏడుపాయల, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఏడుపాయలలో వనదుర్గామాతను ఆయన దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నారు.

## ఢిల్లీలో ఎన్డీయే నేతల సమావేశం.. పాల్గొన్న సీఎం చంద్రబాబు

తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో చోటుచేసుకున్న ఘటనలు, తదుపరి కార్యాచరణపై ఇందులో చర్చించే అవకాశం ఉంది.

**ఢిల్లీ, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** ఢిల్లీలో ఎన్డీయే నేతల సమావేశం కొనసాగుతోంది. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఏర్పాటు చేసిన ఈ భేటీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా , ఏపీ సీఎం చంద్రబాబు , రామ్మోహన్నాయుడు సహా పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయే పక్ష నేతలు పాల్గొన్నారు.దేశంలో తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో చోటుచేసుకున్న ఘటనలు, తదుపరి కార్యాచరణపై ఇందులో చర్చించే అవకాశం ఉంది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ విషయంలో మిత్రపక్షాల మధ్య మెరుగైన సమన్వయం సాధించడంతోపాటు కాంగ్రెస్కు గట్టిగా సమాధానం చెప్పే అంశంపైనా ఎన్డీయే నేతలు చర్చించనున్నారు. జేపీసీ పరిశీలనకు పంపాలని నిర్ణయించిన జమిలి ఎన్నికల బిల్లుపై, వకచట్ట సవరణ బిల్లుపై అనుసరించాల్సిన వ్యూహాలు, ఢిల్లీ సరిహద్దుల్లో అన్నదాతల నిరసనలు, వచ్చే ఏడాదిలో ఢిల్లీ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో కూటమి పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు అంశంపైనా చర్చ జరగనున్నట్లు సమాచారం.



## మేధావులు.. వారితో మా పాలనను పోల్చిచూడండి :ప్రధాని మోదీ

నదుల అనుసంధాన ప్రాజెక్టులో కీలకమైన కెన్-బెత్వా ప్రాజెక్టుకు ప్రధాని మోదీ నేడు ఖజురహోలో శంకుస్థాపన చేశారు.




**డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** స్వాతంత్ర్యం వచ్చాక భాజపా ప్రభుత్వాలు చేసిన అభివృద్ధిని ఇతర పార్టీల పాలనతో పోల్చి చూడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. కెన్ - బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ఆయన నేడు ఖజురహోలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రెండు నదుల జలాలను ఆయన ప్రాజెక్టు నమూనాలో పోశారు. అనంతరం రిమోట్ బటన్ సాయంతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. "భాజపా ప్రభుత్వానికి రాష్ట్రంలో ఏడాది పూర్తయింది. ఈ కాలంలో ఇక్కడ అభివృద్ధికి కొత్త దిశ లభించింది. ఇక్కడ రూ.వేల కోట్ల విలువైన కార్యక్రమాలు మొదలయ్యాయి. నేడు కెన్- బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు శంకుస్థాపన జరిగింది. దేశాభివృద్ధిలో అటల్ బిహారీ వాజ్పేయి కీలక పాత్ర పోషించారు. సుశాన్ దినోత్సవం మా ప్రభుత్వానికి ఒక్కరోజు కార్యక్రమం కాదు.. మా గుర్తింపు అది.దేశ ప్రజలు మూడోసారి కేంద్రంలో ఎన్డీయే సర్కారును ఎన్నుకొన్నారు. ఇక మధ్యప్రదేశ్లో వరుసగా మా పార్టీని ఎన్నుకోవడంలో సుపరిపాలన పాత్ర చాలా కీలకం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని మేధావులు కొన్ని ప్రమాణాలను తీసుకొని.. కాంగ్రెస్, లెఫ్ట్, కుటుంబ, సంకీర్ణ పార్టీల పాలనలో ఏం పనులు జరిగాయి..? భాజపా ఉన్న చోట్ల అభివృద్ధి ఎలా జరిగిందో విశ్లేషించాలి. మా పార్టీ ప్రజల కోసం కట్టుబడి ఉంది. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఎంత వరకు చేరాయి అన్నదే ప్రామాణికం. కాంగ్రెస్ సర్కారు కేవలం అభివృద్ధి ప్రకటనల హడావుడికే పరిమితం అవుతుంది. ఆ పథకాల ఫలాలు ప్రజలకు చేరేవి కావు. ఏళ్ల క్రితం శంకుస్థాపనలు అయిన వాటి పని కూడా ఒక్క అంగుళం ముందుకు జరగకపోవడాన్ని మేము గమనించాము. మా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పించాము.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జల్శక్తిపై ఎవరు పనిచేశారో తెలుసా.. వాస్తవాలను ఇన్నాళ్లూ దాచిపెట్టారు. భారత జల్శక్తి, డ్యామ్ల వెనుక ఘనత బాబా సాహెబ్ అంబేడ్కర్కు చెందుతుంది" అని అన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి పేరిట తపాల బిళ్ల, రూ.100 నాణెంను ప్రధాని మోదీ విడుదల చేశారు. నదుల అనుసంధానంలో మొదటిదైన కెన్-బెత్వా పథకం వల్ల ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు, ప్రత్యేకించి వెనకబడిన బుందేలఖండ్ ప్రాంతానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. 2009లోనే అప్పటి కేంద్రప్రభుత్వం దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. మొత్తం ఒకేసారి కాకుండా దశలుగా విభజించి పనులు చేపట్టాలని నిర్ణయించింది. మొదటి దశకు 2017 జూన్లో పెట్టుబడి అనుమతి లభించింది.

## అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు
## : కేంద్ర మంత్రి బండి సంజయ్

అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు ఉన్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.



**హైదరాబాద్, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** కాంగ్రెస్ నేతలకు అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మీడియాతో చిట్చాట్లో ఆయన మాట్లాడారు. "ఎన్టీఆర్ మార్గ్ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తాళాలు వేశారు. ఆయన చరిత్ర తెలిపేలా ఉన్న గదుల్లోకి వెళ్లనివ్వడం లేదు. సీఎం హోదాలో రేవంత్రెడ్డి ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదు.భాజపా ఒత్తిడి మేరకు గత భారాస ప్రభుత్వం ఆ విగ్రహ నిర్మాణం పూర్తి చేసింది. అంబేద్కర్కు సంబంధించిన పంచ తీర్థాలను రాహుల్ గాంధీ దర్శనం చేసోవాలి. అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు వస్తున్నాయి. సినీ పరిశ్రమ ఆంధ్రాకు పోవాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారు. ఇండస్ట్రీ ఆంధ్రాకు తరలివెళ్తే తెలంగాణకే నష్టం. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుకుండా వారి అధిష్ఠానం అదుపులో పెట్టాలి" అని బండి సంజయ్ అన్నారు.

## మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు
## : సీఎం రేవంత్ రెడ్డి

వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ కేథడ్రల్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



**మెదక్, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎంరేవంత్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు.పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ధి చేకూరనుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతుల చెంచయ్య వర్ధంతి

ప్రకాశం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతుల చెంచయ్య వర్ధంతిని మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు బుధవారం నిర్వహించారు.



టంగుటూరు, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): ప్రకాశం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతుల చెంచయ్య వర్ధంతిని మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్ని మాట్లాడారు. పోతుల చెంచయ్య సేవలు మర-ువలేనివని, విలువలతో కూడిన రాజకీయాలను నిర్వహించారని ఆయన అన్నారు. పోతుల చెంచయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి. ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, తెదేపా మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పడిపూజలో పాల్గొననున్న ఎమ్మెల్యే పోచారం

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించనున్న పడిపూజకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.



బాన్సువాడ ,డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించనున్న పడిపూజకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శంకర్ గురుస్వామి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కొత్తకొండ భాస్కర్, గురు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం

క్రిస్మస్ సందర్భంగా ఇల్లందులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు.



ఇల్లందు ,డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): క్రిస్మస్ సందర్భంగా ఇల్లందులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. పట్టణంలోని పలు చర్చిలలో జరిగిన వేడుకల్లో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాల్లో పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పలు చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధికమంది ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ జరుపుకునే క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా సంతోషంగా చేసుకోవాలని కోరారు. అందరి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

# శ్రీతేజ్ కుటుంబానికి రూ.2కోట్ల సాయం: అల్లు అరవింద్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు.




హైదరాబాద్, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ను పరామర్శించిన అనంతరం ఆయన ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరపున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు.

# ఫార్ములా ఈ–రేసు కేసు

## .. దాన కిశోర్ వాంగ్మూలం నమోదు

ఫార్ములా ఈ-రేసు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫిర్యాదుదారుడు ఐఏఎస్ దాన కిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నమోదు చేశారు.



హైదరాబాద్, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): ఫార్ములా ఈ-రేసు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫిర్యాదుదారుడు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నమోదు చేశారు. దీని ఆధారంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పురపాలకశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్కుమార్కు నోటీసులిచ్చే అవకాశం ఉంది. ఈమేరకు ఏసీబీ సిద్ధమవుతోంది.ఫార్ములా ఈ-రేసు నిర్వహణ కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీసంస్థకు సొమ్ము చెల్లించారంటూ దానకిశోర్ ఏసీబీకి ఈ ఏడాది అక్టోబరు 18న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారాస హయాంలో పురపాలకశాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్ను ప్రధాన నిందితుడి (ఏ1)గా పేర్కొంటూ తెలంగాణ ఏసీబీ ఇటీవల కేసు నమోదు చేసింది. పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్కుమార్ (ఏ2), హెచ్ఎండీఏ అప్పటి చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి(ఏ3)లనూ ఎఫ్ఐఆర్ చేర్చింది

# మెదక్ చర్చిలో ఘనంగా శతాబ్ది క్రిస్మస్ వేడుకలు

ఆసియాలోనే రెండో పెద్దదైన మెదక్ చర్చిలో శతాబ్ది క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.



మెదక్, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): ఆసియాలోనే రెండో పెద్దదైన మెదక్ చర్చిలో శతాబ్ది క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 4.30 గంటలకు ప్రాతఃకాల ఆరాధనతో క్రిస్మస్ మహోత్సవం ప్రారంభమైంది. చర్చి ఆనవాయితీ ప్రకారం శిలువను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠాపన చేశారు.భక్తులకు ఇన్ఛార్జి బిషప్ రూబెన్ మార్క్ దైవసందేశం ఇచ్చారు. ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. సమస్త మానవాళికి ఏసుప్రభువు ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. నిస్వార్థంగా ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ

# భవానీ దీక్షల విరమణ

## .. ఇంద్రకీలాద్రిపై భారీ రద్దీ

భవానీ దీక్షల విరమణతో విజయవాడ లోని ఇంద్రకీలాద్రిపై భారీగా రద్దీ నెలకొంది.



విజయవాడ, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): భవానీ దీక్షల విరమణతో విజయవాడ లోని ఇంద్రకీలాద్రిపై భారీగా రద్దీ నెలకొంది. దీక్షల విరమణ చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున భవానీలు తరలివస్తున్నారు.ఆలయ అధికారులు అన్ని క్యూ లైన్లలోనూ ఉచితంగానే దుర్గమ్మ దర్శనానికి అనుమతిస్తున్నారు.క్యూలో ప్రవేశించిన వారికి దర్శనం పూర్తయ్యేసరికి 2 నుంచి 3గంటల సమయం పడుతోంది.జగన్మాత నామస్మరణతో ఇంద్రకీలాద్రి ప్రతిధ్వనిస్తోంది.అమ్మవారి దర్శనం అనంతరం భవానీ ఘాట్, పున్నమి ఘాట్, సీతమ్మవారి పాదాల సమీపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక కేశఖండనశాల వద్ద దీక్షాదారులు తలనీలాలు సమర్పిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. ఇవాళ పూర్ణాహుతితో భవానీ దీక్షల విరమణ కార్యక్రమం పరిసమాప్తం కానుంది.తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివస్తోన్న భవానీలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఆలయ ఈవో రామారావుతోపాటు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఇతర శాఖల అధికారులు మోడల్ గెస్ట్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భక్తుల రద్దీ, దర్శనాలు, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# సంధ్య థియేటర్ ఘటన

## ..తప్పుడు పోస్ట్ లపై పోలీసుల వార్నింగ్

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు సమాచారం పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు.




హైదరాబాద్, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు సమాచారం పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు."తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో పాటు ప్రజలను అపోహలకు గురిచేసేలా వీడియోలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నటుడు అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్లు కొందరు తప్పుడు వీడియోలు పోస్ట్ చేసిన అంశం మా దృష్టికి వచ్చింది. ఘటనపై విచారణ క్రమంలో తెలిసిన నిజాలను వీడియో రూపంలో పోలీసుశాఖ ఇప్పటికే ప్రజల ముందు ఉంచింది. ఉద్దేశపూర్వకంగా పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు పోస్టు పెడితే తీవ్రంగా పరిగణిస్తాం. ఈ ఘటనకు సంబంధించి ఏ పౌరుడి దగ్గరైనా ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే మాకు అందించవచ్చు" అని నగర పోలీసులు పేర్కొన్నారు.

# వాజిపేయిా పదవులకు ఆశపడకుండా

## నిస్వార్థంగా పని చేశారు: కేంద్ర మంత్రి బండి సంజయ్

మాజీ ప్రధాని వాజ్పేయిా భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలను ప్రపంచానికి చాటారని కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): మాజీ ప్రధాని వాజ్పేయిా భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలను ప్రపంచానికి చాటారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వాజ్పేయిా శత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. వాజ్పేయిా పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పని చేశారని పేర్కొన్నారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా.. ప్రజాతీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారని కొనియాడారు.అంబేడ్కర్ రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళు తున్న పార్టీ భాజపా అన్నారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. అబద్ధాల్లో ఆ పార్టీకి ఆస్కార్ అవార్డు ఇవ్వవచ్చన్నారు. బడుగు, బలహీనర్గాలు ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ఉన్నాయని చెప్పారు.

# భారాస ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి పోలీసుల నోటీసులు

భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బంజారాహిల్స్ పోలీసులు నోటీసులు జారీ చేశారు.



హైదరాబాద్, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బంజారాహిల్స్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని పేర్కొన్నారు. బంజారాహిల్స్ పీఎస్ లో విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై కౌశిర్రెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

# రైతులకు మరింత మేలు చేకూర్చే విధంగా కార్యక్రమాలు : మంత్రి అచ్చెన్నాయుడు

సహకార శాఖ ద్వారా రైతులకు మరింత మేలు చేకూర్చే కార్యక్రమాలు చేపడతామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.



విజయవాడ, డిసెంబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): సహకార శాఖ ద్వారా రైతులకు మరింత మేలు చేకూర్చే కార్యక్రమాలు చేపడతామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 'సహకారంతో సంవృద్ధి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా 10,212 నూతన బహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు, మత్స్యకార సహకార సంఘాలను 2023 నుంచి రిజిస్టర్ చేసి నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 932 డెయిరీ సహకార సంఘాల ద్వారా రోజుకు 1,60,000 లీటర్ల పాల సరఫరా జరుగుతోందని వెల్లడించారు. తద్వారా 45,000 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఆ సమయంలో శ్రీదేవి నాతో ఆరు నెలలు మాట్లాడలేదు:

**అలనాటి నటి శ్రీదేవి తో తన ప్రేమ, పెళ్లి గురించి బాలీవుడ్ ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ స్పందించారు. శ్రీదేవి తన ప్రేమను మొదట అంగీకరించలేదని ఆయన అన్నారు.**



తన సతీమణి, దివంగత నటి శ్రీదేవి తో తన ప్రేమ, పెళ్లి గురించి బాలీవుడ్ ప్రముఖ నిర్మాత బోనీకపూర్ స్పందించారు. శ్రీదేవి అంటే తనకెంతో ఇష్టమని అన్నారు. చివరిశ్వాస వరకూ ఆమెను ప్రేమిస్తూనే ఉంటానని చెప్పారు. శ్రీదేవి తన ప్రేమను వెంటనే అంగీకరించలేదని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు."ఆమెను నేను జీవితాంతం ప్రేమిస్తూనే ఉంటా. నా చివరిక్షణం వరకూ ఆమె జ్ఞాపకాలతో ప్రేమలో ఉంటా. ప్రేమ, పెళ్లి విషయంలో ఆమెను ఒప్పించడానికి నాకు దాదాపు ఆరేళ్లు పట్టింది. తొలిసారి నేను ప్రపోజ్ చేసినప్పుడు ఆమె నన్ను తిట్టింది. దాదాపు ఆరు నెలలు నాతో మాట్లాడలేదు. "మీకు పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇప్పుడు మీరు నాతో ఇలా ఎలా చెప్పగలుగుతున్నారు?" అని ఆగ్రహం వ్యక్తంచేసింది. నా మనసులోని భావాన్ని ఆమెకు పూర్తిగా తెలియజేశా. చివరకు ఆమె అంగీకరించింది. విధి మాకు అనుకూలించింది" అని బోనీ కపూర్ తెలిపారు."ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే నమ్మకం వల్లే వారి మధ్య బంధం బలపడుతుంది. రోజురోజుకీ అది పెరుగుతూ ఉండాలి. ఈ భూమ్మీద ఎవరూ పర్ఫెక్ట్ కాదు. నేను కూడా పర్ఫెక్ట్ పర్సన్ కాదు. శ్రీదేవితో ప్రేమలో పడటానికి ముందు నాకు పెళ్లి అయింది. పిల్లలు ఉన్నారు. అలా అని ఆ విషయాన్ని నేను ఎక్కడా దాచలేదు. నా ప్రేమ గురించి మోనా (మొదటి భార్య), పిల్లలకు చెప్పా. వాళ్లు నన్ను అర్థం చేసుకున్నారు. విషయం ఏదైనా సరే మన భాగస్వామి, పిల్లలతో ఎప్పుడూ నిజాయితీగా ఉండాలనేది నా భావన" అని అన్నారు.శ్రీదేవి కెరీర్ లో బిజీగా ఉన్న సమయంలో బోనీకపూర్తో పరిచయం ఏర్పడింది. బాలీవుడ్లో ఆమె నటించిన పలు చిత్రాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. 1996లో వీరి పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు (జాన్వీ, ఖుషి). 2018లో శ్రీదేవి మరణించారు. ఆమె అకాలమరణం తనని ఎంతో కలచివేసిందని బోనీ పలు సందర్భాల్లో చెప్పారు.

## ఆస్కార్ మ్యూజియంలో ఐశ్వర్య లెహెంగా ..ఆనందిస్తోన్న అభిమానులు




**'జోధా అక్బర్' సినిమాలో ఐశ్వర్యరాయ్ ధరించిన లెహెంగా మరోసారి అందరినీ ఆకర్షిస్తోంది.**

2008లో వచ్చి సూపర్ హిట్ను సొంతం చేసుకున్న చిత్రం 'జోధా అక్బర్'. ఈ చిత్రంలో ఐశ్వర్య ధరించిన లెహెంగా తాజాగా మరోసారి అందరినీ ఆకర్షిస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ మ్యూజియంలో ఇది చోటు దక్కించుకుంది. ఈవిషయాన్ని తెలుపుతూ అకాడమీ తన అధికారిక ఇన్స్టాలో పోస్ట్ పెట్టింది.'ఆ సినిమాలో రాణికి ఈ లెహెంగా మరింత అందాన్ని తెచ్చింది. వెండితెరపై ఎంతోమందిని ఆకర్షించిన దీన్ని ఆస్కార్ మ్యూజియంలో ప్రదర్శించనున్నాం. ఇది చరిత్రలో నిలిచిపోతుంది' అని అకాడమీ పోస్టో పేర్కొంది. దీనిపై అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 'డియర్ హాలీవుడ్.. ఇంతకుమించిన అందాన్ని కనిపెట్టండి చూద్దాం' అని ఓ అభిమాని కామెంట్ పెట్టారు. 'ఆ మ్యూజియం ఇకపై మరింత అందంగా కనిపిస్తుంది' అని మరొకరు అన్నారు. అకాడమీ మ్యూజియంలో కనిపించనున్న మొదటి ఇండియన్ డ్రెస్ ఇదే కావడం విశేషం. దీంతో ఈ లెహెంగాను రూపొందించిన నీతా లుల్లా పనితీరును పలువురు ప్రశంసిస్తున్నారు. 2008లో విడుదలైన 'జోధా అక్బర్' సినిమాలో అక్బర్గా హృతిక్ రోషన్, జోధా రాణిగా ఐశ్వర్యరాయ్ కనిపించారు. ఈ చిత్రంలోని నటీనటులు ధరించిన దుస్తులు అప్పట్లో అందరినీ ఆకర్షించాయి. ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచింది.ఇక ఐశ్వర్యరాయ్ చివరిసారి మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్-2'లో కనిపించారు. ఈ సినిమాలో నటనకు ఆమె ఉత్తమ నటిగా సైమా అవార్డును గెలుచుకున్నారు. తన భర్త అభిషేక్ తో కలిసి మణిరత్నం దర్శకత్వంలో నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది.

## 'మా' సభ్యులకు మంచు విష్ణు కీలక సూచన

**మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సభ్యులను ఉద్దేశించి మంచు విష్ణు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిణామాల నేపథ్యంలో సున్నితమైన అంశాలపై ఎవరూ స్పందించవద్దని తెలిపారు.**





మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నటుడు మంచు విష్ణు తాజాగా ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో 'మా' సభ్యులకు ఆయన కీలక సూచనలు చేశారు. సున్నితమైన విషయాలపై ఎవరూ స్పందించకపోవడం మంచిదని తెలిపారు."మన కళాకారులు ఎల్లప్పుడూ అన్ని ప్రభుత్వాల ప్రజాప్రతినిధులతో అనుబంధం, మంచి సంబంధాలు కలిగిఉంటారు. సహకారం, సృజనాత్మకతపై ఆధారపడి నడిచేది మన చిత్ర పరిశ్రమ. గతంలో వివిధ ప్రభుత్వాల మద్దతు వల్ల మన పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందింది. ప్రత్యేకంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ హైదరాబాద్లో స్థిరపడటానికి ఆనాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం అత్యంత ముఖ్యమైనది. నాడు మొదలుకొని, ప్రతి ప్రభుత్వంతో మన పరిశ్రమకు ఎల్లప్పుడూ సత్సంబంధాలు కొనసాగుతూనే ఉన్నాయి.ఇటీవల జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, సభ్యులంతా సున్నితమైన విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలను బహిరంగంగా ప్రకటించడం, వివాదాస్పద అంశాలపై ఒకవైపు మాట్లాడటం మానుకోవాలి. కొన్ని సమస్యలు వ్యక్తిగతమైనవి, మరికొన్ని విషాదకరమైనవి. వాటిపై చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుంది. అలాంటి అంశాలపై మాట్లాడటం వల్ల అది సమస్యలను పరిష్కరించడానికి బదులు సంబంధిత పక్షాలకు మరింత నష్టం చేకూరుస్తోంది. ఇలాంటి సమయంలో మనకి సహనం, సానుభూతి, ఐక్యత అవసరం.క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఓ పెద్ద కుటుంబం అన్న సంగతి గుర్తుంచుకొందాం. ఏ సమస్య వచ్చినా మనమంతా కలిసికట్టుగా ఎదుర్కొందామని తెలియజేస్తున్నా" అని మంచు విష్ణు పేర్కొన్నారు.


## చరిత్రలో నేటి ప్రత్యేకత


- **2014** : భారతదేశంలో సుపరిపాలన దినోత్సవం
  ఏసు క్రీస్తు పుట్టిన రోజు. దీనిని క్రిస్టమస్ గా క్రైస్తవులు జరుపుకుంటారు.
- **1846** : కేరళలోని తిరువంకూరు మహారాజు, రచయిత స్వాతి తిరునాళ్ మరణం (జ.1813).
- **1861** : భారతీయ విద్యావేత్త, రాజకీయవేత్త మదన్ మోహన్ మాలవ్యా జననం (మ.1946).
- **1901** : తెలుగులెంకగా ప్రసిద్ధిచెందిన కవి, తుమ్మల సీతారామమూర్తి జననం (మ.1990).
- **1919** : భారత సినిమా సంగీతకారుడు. బాలీవుడ్ కు చెందిన సంగీతకారుడు నౌషాద్ జననం (మ.2006).
- **1924** : పూర్వ భారత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి జననం. (చిత్రంలో)
- **1972** : స్వతంత్ర భారత్ కు తొలి, తుది భారతీయ గవర్నర్ జనరల్, రాజాజీ మరణం (జ.1878).
- **1977** : విషాదం నేపథ్యంలో నవ్వులు పండించిన హాస్యనటుడు చార్లీచాప్లిన్ మరణం (జ.1889).



క్రిస్టమస్ గా క్రైస్తవులు


స్వాతి తిరునాళ్


మోహన్ మాలవ్యా


సీతారామమూర్తి


నౌషాద్


అటల్ బిహారీ


జనరల్, రాజాజీ


చార్లీచాప్లిన్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్గా రోహిత్ వస్తే .. మరి వారిద్దరి సంగతేంటి? బోర్డర్


**గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య నాలుగో టెస్టు గురువారం నుంచి ప్రారంభం కానుంది.**



ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్టు ఆడేందుకు టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. గురువారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుంది. అయితే, భారత బ్యాటింగ్ ఆర్డర్ ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. గత రెండు మ్యాచుల్లో రోహిత్ ఓపెనింగ్ స్థానం నుంచి ఆరో స్థానానికి మారాడు. కానీ, అక్కడ దారుణంగా విఫలమై నిరాశ పరిచాడు. మరోవైపు కేఎల్ మాత్రం ఓపెనర్ గా అదరగొట్టేశాడు. దీంతో అతడిని పక్కకు జరపలేని పరిస్థితి టీమ్ ఇండియా మేనేజ్మెంట్కు ఎదురైంది. నిన్న ప్రెస్కాన్ఫరెన్స్లోనూ బ్యాటింగ్ ఆర్డర్పై రోహిత్ ఆందోళన అవసరం లేదని చెప్పాడు. కానీ, తాజా కథనాల ప్రకారం రోహిత్ ఓపెనర్గా తిరిగి వస్తాడని తెలుస్తోంది. పాత బంతిని ఆడటంలో రోహిత్ ఇబ్బంది పడ్డాడు. ఎటాకింగ్ గేమ్ ఆడి పరుగులు చేయాలని ఇప్పటికే రవిశాస్త్రి వంటి మాజీలు సూచించారు. కొత్త బంతితో రోహిత్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తాడు.ఒకవేళ కెప్టెన్ రోహిత్ ఇన్నింగ్స్ను ప్రారంభిస్తే.. కేఎల్ రాహుల్ పరిస్థితి ఏంటి? అనే ప్రశ్న తలెత్తడం సహజం. కేఎల్ రాహుల్ను వన్డేన్లో ఆడిస్తారని.. శుభ్మన్ గిల్ ఎక్కడ బ్యాటింగ్ చేస్తాడనేది ఆసక్తికరంగా మారనుంది. ఇక బాక్సింగ్ టెస్టులో టీమ్ ఇండియా ఇద్దరు స్పిన్నర్లను రంగంలోకి దించనుందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా బ్యాటింగ్ కూడా చేయగలరు. అప్పుడు పేస్ ఆల్రౌండర్ నితీశ్ కుమార్రెడ్డిని మెల్బోర్న్ టెస్టుకు పక్కన పెట్టే అవకాశం లేకపోలేదు. మెల్బోర్న్ పిచ్ బ్యాటింగ్కు అనుకూలంగా ఉంటుంది. ముగ్గురు ప్రధాన పేసర్లతో దిగితే సరిపోతుందనేది క్రికెట్ విశ్లేషకుల అంచనా. అయితే, ఆస్ట్రేలియా ఇప్పటికే తన తుది జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. ముగ్గురు ప్రధాన ఫాస్ట్ బౌలర్లు స్టార్క్, కమిన్స్, బోలాండ్ తోపాటు పేస్ ఆల్రౌండర్ మిచెల్ మార్కు చోటు కల్పించింది. కొత్త ఆటగాడు సామ్ కాన్స్టాస్కు అవకాశం ఇచ్చింది. గాయం కారణంగా సిరీస్కు దూరమైన జోష్ హేజిల్ వుడ్ స్థానంలో స్కాట్ బోలాండ్ను తీసుకుంది.

ఆరోగ్యం

## వీరభద్రాసనంతో గుండె సమస్యలతో పాటు ఇవన్నీ దూరం



వీరభద్రాసనం.. దీనినే వారియర్ పోజ్ అంటారు. ఇది గుండె ఆరోగ్యానికి ఎన్నో విధాలు హెల్ప్ చేస్తుంది. ఈ ఆసనం చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. హృదయ స్పందన రేటు అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఈ వీరభద్రాసనాన్ని రెగ్యులర్గా చేయడం మంచిది. ఈ ఆసనం చేయడం వల్ల కేవలం గుండెకి మాత్రమే కాదు. ఇతర లాభాలు కూడా ఉన్నాయి.




### ఎలా చేయాలి..



శరీర బరువుని ఓ కాలిపై బ్యాలెన్స్ చేయండి. నిదానంగా నిల్చొని ఈ ఆసనం చేయండి. నెమ్మదిగా రెండు కాళ్ళని భుజాలకి సమాంతరంగా చాచండి.ఇప్పుడు కుడి పాదాన్ని కుడివైపుకి తిప్పి కాలి వేళ్ళు, పాదాల నొక్కుతూ బాడీని బ్యాలెన్స్ చేయాలి. ఇప్పుడు చేతులని పైకి ఎత్తుతూ నమస్కార ముద్రలో ఉంచాలి. బరువుని కుడి పాదంపైకి తీసుకొచ్చు.. ఎడమ కాలిని మెల్లిగా పైకి లేపాలి.ఇప్పుడు కుడికాలిని స్ట్రెయిట్గా ఉంచండి. ఎడమపాదాన్ని బ్యాలెన్స్ చేయాలి. మెడ వెన్ను రెస్ట్ తీసుకుంటాయి. ఇదే ఆసన స్థితిలో ఉండగలిగేంత సేపు ఉండాలి. తర్వాత మెల్లిగా కాళ్ళని యథాస్థానానికి తీసుకొచ్చి చేతులు, కాళ్ళని చాచి రెస్ట్ తీసుకోండి.

### బెనిఫిట్స్..



ఈ ఆసనం చేయడం వల్ల తుంటి, కోర్ బలంగా మారుతుంది. బ్యాలెన్స్ పెరుగుతుంది.ఛాతీ, భుజాలు స్ట్రెచ్ అవుతాయి. ఏకాగ్రత పెరుగుతుంది. దీంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. సయాటికాకి చాలా మంచిది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. బాడీలో కొలెస్ట్రాల్ తగ్గుతుంది. లోయర్ మజిల్స్ హెల్దీగా ఉంటాయి.


### దీంతో పాటు..



అథ్లెట్స్కి ఈ ఆసనం చాలా మంచిది. ఈ ఆసనంతో బలం, ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. దీంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. ఈ ఆసనం వేసినప్పుడు ఏకాగ్రత అవసరం. దీంతో ఇది మైండ్ ఫుల్నెస్ని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. మరిన్ని లాభాలు కూడా ఉన్నాయి.



### ఎవరు చేయొద్దు..



మోకాళ్ళ నొప్పులు ఉన్నవారు, సర్జరీ అయినవారు చేయొద్దు. తలతిరగడం వంటి సమస్యలున్నవారు కూడా ఈ ఆసనానికి దూరంగా ఉండాలి. దీంతో పాటు ఆసనం చేసే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.

**గమనిక :**

ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

